సాక్షి మెదక్

మంగళవారం ; 28 ; మార్చి ; 2023



'పొద్దు' పాడుపు 8లో

పొద్దు తిరుగుడు పంట సాగుచేసిన రైతులకు మద్దతు లభిస్తోంది. ఈ ఏడాది మార్కెట్‌లో గింజలకు ధర తగ్గిన నేపథ్యంలో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు.




స్నేహితుల నడుమ సెల్‌ఫోన్ గొడవ

స్నేహితుల మధ్య సెల్‌ఫోన్ విషయంలో జరిగిన గొడవ హత్యకు దారితీసింది. వివరాలను సోమవారం బొల్లారం పీఎస్‌లో సీఐ సురేందర్‌రెడ్డి వెల్లడించారు. 8లో

మరో ఏడుగురికి కరోనా



మెదక్ జోన్: జిల్లావ్యాప్తంగా సోమవారం 79 మందికి కరోనా పరీక్షలు నిర్వహించగా ఏడుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయినట్టు జిల్లా వైద్యాధికారి చందూనాయక్ తెలిపారు. పాపన్నపేటలో ఇద్దరు, నార్సింగి, ధర్మారంలో ఒక్కొక్కరు, మెదక్‌లో ముగ్గురు కరోనా బారిన పడినట్టు చెప్పారు.



న్యూస్‌రీల్

డీఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూం

మెదక్ కలెక్టరేట్: పదో తరగతి విద్యార్థుల సందేహాల నివృత్తి కోసం డీఈఓ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశామని డీఈఓ రాధాకిషన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏప్రిల్ 3 నుంచి ప్రారంభం కానున్న వార్షిక పరీక్షలను దృష్టిలో ఉంచుకొని కంట్రోల్ రూం ఏర్పాటు చేశామన్నారు. పనిదినాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సంప్రదించాలన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి 7207704500, జిల్లా సైన్స్ అధికారి 8328599157, పరీక్షల సహాయ కమిషనర్ 9491676947, రిసోర్స్ పర్సన్ 9492827089 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

కాంగ్రెస్ హయాంలోనే అభివృద్ధి



నర్సంపల్లి తండాలో పాదయాత్ర చేస్తున్న శ్రీనివాసరెడ్డి

రామాయంపేట(మెదక్): కాంగ్రెస్ హయాంలోనే నిజమైన అభివృద్ధి జరిగిందని దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం నార్సింగి మండలం నర్సంపల్లి, పెద్ద తండా, చిన్న తండాలో ఆత్మగౌరవ పాదయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం అభివృద్ధిని ఎంత మాత్రం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఇళ్లు నిర్మించుకునే వారికి రూ. ఐదు లక్షలు మంజూరు చేస్తుందని తెలిపారు. రూ. ఐదు వందలకే గ్యాస్ సిలిండర్ ఇస్తామన్నారు. నార్సింగి మండలం పూర్తిగా వివక్షకు గురైందని మండిపడ్డారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండలశాఖ అధ్యక్షుడు గోవర్ధన్, జిల్లా నాయకులు గౌండస్వామి, యాదగిరి, రఫీక్, శ్రీనివాస్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు స్వామి, గ్రామ శాఖ అధ్యక్షుడు శంకర్‌నాయక్, నాయకులు సుధాకర్, ప్రవీణ్‌రెడ్డి, కుర్షీద్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



అవగాహన కల్పిస్తున్న భారతి

టేక్మాల్(మెదక్): పౌష్టికాహారం తీసుకుంటేనే ఆరోగ్యంగా ఉంటామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ భారతి అన్నారు. సోమవారం మండలంలోని సాలోజిపల్లిలో పోషణ్ పక్వాడ వారోత్సవాల్లో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆకుకూరలతో పాటు చిరు ధాన్యాలను ఆహారంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హర్షబేగం, పంచాయతీ కార్యదర్శి అజ్మీర్‌మియా, అంగన్‌వాడీ టీచర్ తిరుమల, ఆశవర్కర్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ ఆయాకు టీచర్‌గా పదోన్నతి



నియామకపత్రం అందజేస్తున్న సీడీపీఓ హేమభార్గవి

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లిలోని నాల్గవ అంగన్‌వాడీ కేంద్రంలో విధులు నిర్వర్తిస్తున్న అంగన్‌వాడీ ఆయా రజియా సుల్తానా అంగన్‌వాడీ టీచర్‌గా పదోన్నతి పొందింది. సోమవారం ఐసీడీఎస్ నర్సాపూర్ ప్రాజెక్ట్ సీడీపీఓ హేమభార్గవి నియామకపత్రం అందజేసింది. అంగన్‌వాడీ టీచర్ సంతోష సూపర్‌వైజర్‌గా పదోన్నతిపై వెళ్లడంతో పోస్ట్ ఖాళీ అయింది. దీంతో ప్రభుత్వం ఆయాకు టీచర్‌గా పదోన్నతి కల్పించింది. ఇదిలా ఉండగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రజియాసుల్తానా రాష్ట్ర ఉత్తమ అంగన్‌వాడీ ఆయాగా అవార్డు అందుకుంది.

జలసిరి



మెదక్ మండలంలో బోరు నుంచి వస్తున్న నీరు

- జిల్లాలో సగటున 12.16 మీటర్లలో భూగర్భజలాలు
- అట్టడుగున కొల్చారం.. శివ్వంపేటలో పైపైనే

మెదక్‌జోన్: వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవడం మెతుకు సీమకు కలిసొచ్చింది. జిల్లావ్యాప్తంగా నీటి వనరులు పొంగిపొర్లగా వేసవిలోనూ భూగర్భ జలమట్టం స్థిరంగా ఉంది. గతేడాదితో పోల్చితే 18 సెంటీమీటర్ల వ్యత్యాసంలో భూగర్భజలాలు ఉన్నాయి. ఇది శుభ పరిణామమని అధికారులు చెబుతుండగా.. రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లాలో గత కొన్నేళ్లుగా వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయి. ఫలితంగా చెరువులు, కుంటలు, చెక్‌డ్యాంలు పొంగిపొర్లుతున్నాయి. ఈఏడాది జిల్లాలో సగటున 12.16 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయి. గతేడాది ఫిబ్రవరిలో జిల్లాలో సగటున 11.96 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా.. ఈఏడాది 18 సెంటీ మీటర్ల తేడాతో సమృద్ధిగా ఉన్నాయి. అట్టడుగున కొల్చారం మండలం ఉంది. ప్రస్తుతం ఈ మండలంలో 20.84 మీటర్ల లోతులోకి నీటి ఊటలు పడిపోయాయి. ఇది ప్రమాదకర పరిస్థితి అని అధికారులు చెబుతున్నారు. గతేడాది ఫిబ్రవరిలో ఇక్కడ 20 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉండగా ఈఏడాది మరో 84 సెంటీ మీటర్ల లోతులోకి నీటి మట్టం పడిపోయింది. అలాగే శివ్వంపేట మండలం సికింద్లాపూర్‌లో కేవలం 3.49 మీటర్లలోతులోనే నీరు పుష్కలంగా ఉంది. రెండో స్థానంలో పిల్లికొటాల్‌లో 4.37 మీటర్ల లోతులో నీరు ఉంది. కాగా పిల్లికొటాల్ పక్కనే మహబూబ్‌నహర్(ఎంఎన్) కెనాల్‌తో పాటు పుష్పల వాగు ఉంది. ఈ కెనాల్ మట్టితో ఉండడంతో ఘనపూర్ ప్రాజెక్టు నుంచి దిగువన గల వరి పంటలకు నీరు వదిలిన ప్రతిసారి ఇక్కడ భూగర్భజలాలు గణనీయంగా పెరుగుతాయి. అంతే కాకుండా గ్రామాన్ని ఆనుకుని పుష్పలవాగు ఉండడంతో భూగర్భజలాలు పైపైనే ఉంటున్నాయి.

హల్దీలోకి గోదారి.. తోడుగా కాళేశ్వరం

శివ్వంపేట మండలం సికింద్లాపూర్‌లో ప్రాంతంలో ఎలాంటి నీటి వనరులు లేవు, కనీసం చెప్పుకోదగ్గ చెరువు సైతం అందుబాటులో లేదు. కానీ ఇక్కడ కేవలం 3.49 మీటర్ల లోతులోనే నీరు ఉండడానికి కారణం అంతుచిక్కడం లేదు. మూడోస్థానంలో మనోహరాబాద్ మండలం ఉంది. ఇక్కడ 6.92 మీటర్ల లోతులేనే నీరు ఉంది. నాల్గవ స్థానంలో చేగుంటలో 7.64 మీటర్లు, చిన్నశంకరంపేట మండలం గవ్వలపల్లిలో 7.82 మీటర్లు లోతులో నీరు ఉంది. వ్యవసాయానికి విద్యుత్‌ను గణనీయంగా తగ్గించడం భూగర్భజలాలు పుష్కలంగా ఉండేందుకు మరో కారణమని చెప్పొచ్చు. అలాగే జిల్లాలో 50 కిలోమీటర్ల మేర ప్రవహించే హల్దీ ప్రాజెక్టులోకి గోదావరి జలాలను వదలడం, నిజాంపేట, రామాయంపేట, చేగుంట మండలాలకు కాళేశ్వరం నీరు రావడం కూడా భూగర్భ జలమట్టం పెరగడానికి కారణంగా తెలుస్తోంది.

నీరు పుష్కలంగా ఉంది



వానా కాలం వర్షాలు దంచికొట్టడంతో బోరులో నీరు పుష్కలంగా ఉంది. కరెంట్ రోజుకు రెండు దశల్లో 12 గంటలు మాత్రమే ఇస్తున్నారు. 24 గంటల ఇస్తే బోరు బావుల్లో నీరు తగ్గేది.

– సిద్దిరెడ్డి, రైతు, జంగరాయి

బాధిత కుటుంబాలను ఆదుకోండి



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రమేశ్

అదనపు కలెక్టర్ రమేశ్

మెదక్ కలెక్టరేట్: గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతిచెందిన వారి కుటుంబాలకు ఆర్థిక సాయం అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ రమేశ్ పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గతేడాది ఏప్రిల్ నుంచి మోటార్ ప్రమాదాల పథకం కింద జనరల్ ఇన్సూరెన్స్ కౌన్సిల్ ద్వారా నష్టపరిహారం అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. అందులో భాగంగా జిల్లాస్థాయిలో కమిటీలు ఏర్పాటు చేసిందన్నారు. ప్రమాదంలో చనిపోయిన కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రీయింబర్స్‌మెంట్ పద్ధతిన తక్షణ వైద్య చికిత్స అందించాలన్నారు. బాధితుల వివరాలు తీసుకొని కమిటీలో ఆమోదం పొందిన తర్వాత ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని సూచించారు. సమావేశంలో మెదక్ డీఎస్పీ సైదులు, తూప్రాన్ డీఎస్పీ యాదగిరిరెడ్డి, జిల్లా రవాణాధికారి శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరంతో సస్యశ్యామలం

మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): కాళేశ్వరం కాలువలతో మండలంలో 19 వేల ఎకరాలకు సాగు నీరు అందిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీఆర్‌ఎస్ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పడిన తర్వాత విద్యుత్ సమస్యలు తొలగిపోయాయని అన్నారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి ఎమ్మెల్సీ ఎగ్గే మల్లేశం మాట్లాడుతూ.. వచ్చే ఎన్నికల్లో పద్మాదేవేందర్‌రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం మండల కేంద్రం నుంచి నస్కల్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో ఇఫ్కో డైరెక్టర్ దేవేందర్‌రెడ్డి, రైతు బంధు జిల్లా డైరెక్టర్ భాస్కర్‌రావు, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ

టీపీసీసీ ఉపాధ్యక్షుడు జగదీశ్



మాట్లాడుతున్న జగదీశ్

మెదక్‌జోన్: ప్రజాస్వామ్యాన్ని బీజేపీ ప్రభుత్వం ఖూనీ చేస్తోందని టీపీసీసీ ఉపాధ్యక్షుడు జగదీశ్ విమర్శించారు. రాహుల్‌గాంధీ పార్లమెంట్ సభ్యత్వం రద్దుకు నిరసనగా సోమవారం మెదక్ పోస్టాఫీస్ వద్ద కాంగ్రెస్ నాయకులు దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా జగదీశ్ మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ జోడో యాత్రకు దేశవ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారని.. అది చూసి ప్రధాని మోదీ భయపడి కుట్ర చేస్తున్నాడని మండిపడ్డారు. మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య మాట్లాడుతూ.. ఈడీ, సీబీఐని అడ్డు పెట్టుకుని మోదీ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని అన్నారు. దేశ సంపదను అదానీకి దోచిపెడుతున్నారని రాహుల్‌గాంధీ ప్రశ్నించడంతో కక్షగట్టి పార్లమెంట్ సభ్యత్వం రద్దు చేశారన్నారు. అనంతరం డీసీసీ అధ్యక్షుడు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేస్తే సహించమని హెచ్చరించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు సుప్రభాత్‌రావు, మ్యాడం బాలకృష్ణ, నాయకులు మామిళ్ల ఆంజనేయులు, సోమేశ్వర్‌రెడ్డి, అనుబంధ సంఘాల జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి, పల్లె రాంచందర్ గౌడ్, శ్యాంసుందర్, రాజమణి, ప్రేంకుమార్, మహేందర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ డివిజన్‌కు మళ్లీ ఉద్యమం



రామాయంపేట: దీక్షలో అఖిలపక్షం నాయకులు

అఖిలపక్షం ఆధ్వర్యంలో రిలే దీక్షలు ప్రారంభం

రామాయంపేట(మెదక్): రెవెన్యూ డివిజన్ సాధన కోసం మళ్లీ ఉద్యమం ప్రారంభమైంది. సోమవారం రామాయంపేటలో అఖిలపక్షం పేరిట రిలే దీక్షలు ప్రారంభించారు. ఈసారి డివిజన్ కల సాకారమయ్యే వరకు విశ్రమించమని అఖిలపక్షం ప్రతినిధులు పేర్కొన్నారు. గతంలో ఏకంగా 185 రోజుల పాటు దీక్షలు కొనసాగగా, అన్ని వర్గాల ప్రజలు తమ సంపూర్ణ మద్దతు తెలిపారు. ఉద్యమానికి అధికార పార్టీ నాయకులు పరోక్షంగా సహకరిస్తుండగా.. కాంగ్రెస్, బీజేపీ, ఎమ్మార్పీఎస్, ఇతర సంఘాలు, వ్యాపార వర్గాలు, యువజన సంఘాల ప్రతినిధులు మద్దతు ప్రకటించారు.

సాధించే వరకు విశ్రమించం



రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేయాలనే డిమాండ్ మొదటి నుంచి ఉంది. ఎన్నో కొత్త డివిజన్లు ప్రకటించినా రామాయంపేట ప్రస్తావనలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం.

– పోచమ్మల అశ్విని, మహిళానేత

ఇది ప్రజల చిరకాల కోరిక



రామాయంపేటను రెవెన్యూ డివిజన్‌గా మార్చాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇది ప్రజల చిరకాల కోరికగా మిగిలిపోయింది. ఇప్పటికే అన్ని రంగాల్లో రామాయంపేటకు అన్యాయం జరిగింది. డివిజన్ ఏర్పాటైతే పూర్వ వైభవం సంతరించుకుంటుంది.

– సుంకోజ దామోదర్, అఖిలపక్షం నేత

పోరాడి సాధించుకుంటాం



గతంలో 185 రోజుల పాటు ఉద్యమం కొనసాగింది. అధికార పార్టీ ప్రజాప్రతినిధుల హామీతో అప్పుడు దీక్షలు విరమించినా న్యాయం జరగలేదు. విధి లేని పరిస్థితుల్లో మళ్లీ ఉద్యమం ప్రారంభించాం. తమకు అన్ని వర్గాల మద్దతు ఉంది.

– రమేశ్‌రెడ్డి, అఖిలపక్షం నేత

చిరుత కలకలం

పెద్ద శంకరంపేట(మెదక్): మండల పరిధిలోని కే వెంకటాపూర్ శివారులో చిరుత సంచరిస్తుండడంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. చిరుత దాడిలో లేగ దూడ మృతి చెందిందని గ్రామస్తులు పేర్కొంటున్నారు. సోమవారం అటవీశాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టగా పులి పాదముద్రలు కన్పించాయి. గుట్టపై చిరుత పులి సంచరిస్తున్నట్టు ఫారెస్ట్ రేంజ్ అధికారి వికాస్ తెలిపారు. గ్రామస్తులు అప్రమత్తంగా ఉండాలని.. ఒంటరిగా ఎవరూ అటవీ ప్రాంతంలో తిరగవద్దని సూచించారు.



వివరాలు సేకరిస్తున్న ఫారెస్ట్ అధికారులు


'ఎస్సీ వర్గీకరణపై కేంద్రం మోసం'

చిన్నశంకరంపేట(మెదక్): ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా నిలిచి అధికారంలోకి వచ్చాక మోసం చేసిన బీజేపీని నమ్మవద్దని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ మాదిగ అన్నారు. సోమవారం ఖాజాపూర్ నుంచి చిన్నశంకరంపేట వరకు సంగ్రామయాత్ర నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్‌లో బిల్లు పెట్టాలనే డిమాండ్‌తో సంగ్రామ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మాదిగలు మరో పోరాటానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు యాదగిరి, మురళి, ఎంఈఎఫ్ నాయకులు డప్పు నర్సింహులు, మండల నాయకులు శ్రీనివాస్, స్వామి, రాములు, శ్రీనివాస్, రాజు, సాగర్ పాల్గొన్నారు.



సంగ్రామ యాత్రలో గోవిందు నరేశ్ మాదిగ, తదితరులు

కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు



మెదక్ కలెక్టరేట్: జిల్లాలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయని జిల్లా పరీక్షల కమిటీ కన్వీనర్ సత్యనారాయణ తెలిపారు. సోమవారం ఇంటర్ ద్వితీయ సంవత్సర విద్యార్థులకు ఫిజిక్స్, ఎకనామిక్స్ పరీక్షలు నిర్వహించినట్టు చెప్పారు. ఇందులో జనరల్, ఒకేషనల్ పరీక్షకు 6,161 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 5,869 మంది హాజరయ్యారని పేర్కొన్నారు. మరో 292 మంది గైర్హాజరైట్లు వెల్లడించారు.

ప్రజావాణికి 59 అర్జీలు



కలెక్టర్ రాజర్షిషాకు తమ గోడు వెల్లబోసుకుంటున్న ప్రజలు

స్వీకరించిన కలెక్టర్ రాజర్షిషా

మెదక్ కలెక్టరేట్: కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణికి వినతులు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల నుంచి 59 అర్జీలు రాగా కలెక్టర్ రాజర్షిషా స్వీకరించారు. ప్రధానంగా భూసమస్యలు, ధరణి, ఆసరా పింఛన్లు, డబుల్ బెడ్రూం ఇళ్లకు సంబంధించి అధికంగా వచ్చాయి. వినతులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

భూమి కబ్జా చేస్తున్నారు



చేగుంట మండలంలోని పట్టా భూమిని రాంపూర్ సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, ఎంపీటీసీ మాసుల శ్రీనివాస్ కబ్జాకు పాల్పడుతున్నారు. తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా వారికే వత్తాసు పలుకుతున్నారు.

– కుర్మ నాగమల్లయ్య, చేగుంట

పింఛన్ ఆగిపోయింది



వృద్ధ దివ్యాంగురాలినైన నాకు గత రెండేళ్లుగా పింఛన్ రావడం లేదు. దీంతో పడరాని పాట్లు పడుతున్నా. పింఛన్ ఇప్పించి ఆదుకోండి.

– గుండు లక్ష్మి, చిన్నశంకరంపేట

పట్టా పుస్తకం ఇస్తలేరు



60 ఏళ్లుగా కాస్తులో ఉండి పంట పండించుకుంటున్నాం. ఇటీవల ఫారెస్ట్ అధికారులు కొంత భూమి లాగేసుకున్నారు. మిగితా భూమికి పట్టా వచ్చేలా చూడండి.

– చిన్నదుర్గయ్య, మహ్మద్‌నగర్, నర్సాపూర్

నిర్దేశించిన లక్ష్యాలు పూర్తి చేయాలి

ఆర్థిక సంవత్సరం ముగింపునకు గడువు మూడు రోజులే ఉన్నందున నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి అనంతరం వివిధ అంశాలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. స్వయం సహాయక సంఘాలకు వెంటనే బ్యాంకు లింకేజీ అందేలా చూడాలన్నారు. ఆరోగ్య మహిళ, కంటి వెలుగు శిబిరాలను ఎక్కువ సంఖ్యలో వినియోగించుకునేలా పర్యవేక్షించాలని మండల ప్రత్యేకాధికారులకు సూచించారు. నెలాఖరు వరకు సీఎంఆర్ రైస్ ఎఫ్‌సీఐకి అందించేలా చూడాలన్నారు. పదో తరగతి పరీక్ష కేంద్రాల్లో వసతులు కల్పించాలని సూచించారు. సమావేశంలో జిల్లా అధికారులు వెంకటశైలేష్, సాయిబాబ, రాధాకిషన్, కేశురాం, జెంలా నాయక్, లీడ్ బ్యాంక్ అధికారి వేణుగోపాల్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిపై చర్యలు తీసుకోండి



తూప్రాన్‌లోని మహాత్మ జ్యోతిబాపూలే బాలికల హాస్టల్‌లో ప్రిన్సిపాల్, వార్డెన్, టీచర్ల నిర్లక్ష్యంతో ఎనిమిదో తరగతి విద్యార్థి చనిపోయింది. వారిపై తగిన చర్యలు తీసుకొని బాధిత కుటుంబానికి న్యాయం చేయండి.

– ప్రవీణ్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు

పొద్దు పొడుపు

రైతులకు మద్దతుగా కొనుగోలు కేంద్రాలు

మంత్రి హరీశ్‌రావు చొరవతో రాష్ట్రంలోనే తొలిసారిగా..

తాటి జానార్దన్‌రెడ్డి, సంగారెడ్డి డెస్క్‌..

పొద్దుతిరుగుడు పంట సాగుచేసిన రైతులకు మద్దతు లభిస్తోంది. ఈ ఏడాది బహిరంగ మార్కెట్‌లో పొద్దుతిరుగుడు గింజలకు ధర తగ్గిన నేపథ్యంలో మంత్రి హరీశ్‌రావు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రాష్ట్రంలోనే పొద్దు తిరుగుడు సాగుచేసే జిల్లాల్లో సిద్దిపేట ముందు వరుసలో ఉంటుంది. ఈ ఏడాది సిద్దిపేట జిల్లాలో 7058 ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంట సాగుచేశారు. గత ఏడాది బహిరంగ మార్కెట్‌లో పొద్దుతిరుగుడు గింజలు క్వింటాల్‌కు రూ.7వేలకుపైగా ధర పలికింది. ఈ యేడు రూ.4,800 నుంచి రూ.5000లోపు మాత్రమే ఉంది. దీంతో రైతులు నష్టపోకుండా ఉండేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని సీఎం కేసీఆర్‌ను మంత్రి హరీశ్‌రావు కోరారు. దీంతో కొనుగోలు కేంద్రాలకు ఏర్పాటుకు అడుగుపడింది. రాష్ట్రంలోనే తొలి కొనుగోలు కేంద్రంగా సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌లో నోడల్ ఏజెన్సీగా పీఏసీఎస్‌కు బాధ్యతలు అప్పగించారు. గజ్వేల్, రామాయంపేట వ్యవసాయ మార్కెట్‌లలో కూడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. క్వింటాల్‌కు రూ 6,400 మద్దతు ధరతో పొద్దు తిరుగుడు గింజలను కొనుగోలు చేస్తున్నారు. గత ఏడాది మద్దతు ధర రూ.6100 ఉండగా ఈసారి కేంద్రం మరో మూడు వందల రూపాయలు పెంచింది.

పొద్దు తిరుగుడు కొనుగోలు కేంద్రాలు :
సిద్దిపేట, గజ్వేల్, రామాయంపేట
మద్దతు ధర :
రూ.6,400 (క్వింటాల్‌కు)

ప్రైవేట్ ఆగడాలకు చెక్

మద్దతు ధరతో కొనుగోలు చేసే కేంద్రాలు అందుబాటులో లేకపోతే ప్రైవేట్ వ్యాపారులు నిర్ణయించిన ధరనే ఫైనల్. గింజ నాణ్యంగా లేదంటూ క్వింటాల్‌కు 5 కిలోల వరకు తరుగు తీసేవారు. పంట దిగుబడి తక్కువగా ఉన్నప్పుడు ధర పెంచుతూ, దిగుబడి ఎక్కువగా ఉన్నప్పుడు ధర తగ్గిస్తూ కొనేవారు. దీంతో రైతులకు కనీస గిట్టుబాటు ధర కూడా లభించేది కాదు. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 2 వేల రూపాయల వరకు ధర తగ్గింది. ఒక వేళ కొనుగోలు కేంద్రాలు అందుబాటులో లేకపోతే పొద్దుతిరుగుడు పంట సాగు చేసిన రైతులకు చాలా ఇబ్బందులు ఎదురయ్యేవి. కనీసం పెట్టుబడులు కూడా వచ్చేవి కావు. మద్దతు ధరతో మార్కెట్ మాయాజాలానికి చెక్ పడింది.



నాణ్యత తప్పనిసరి

ప్రభుత్వం పొద్దుతిరుగుడు గింజలను మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న నేపథ్యంలో నాణ్యంగా ఉండాలని రైతులకు సూచిస్తోంది. గింజల్లో మట్టిపెల్లలు, చెత్తాచెదారం లేకుండా శుభ్రం చేసి మార్కెట్‌కు తీసుకురావాలి. గింజల్లో తేమశాతం లేకుండా చూడాలి. కొందరు రైతులు గింజలు శుభ్రం చేయకుండా నేరుగా మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. అలాంటి వారిని దృష్టిలో ఉంచుకొని సిద్దిపేటలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో గింజలను శుభ్రం చేసే పరికరాలను కూడా అందుబాటులో ఉంచారు. ఇక్కడ గింజలను శుభ్రపరిచాక కొనుగోలు చేస్తున్నారు.



తరుగు తీసేవారు



ఈ ఫొటోలో కనిపిస్తున్న రైతుపేరు మేకల ఎల్లయ్య. ఈయనది సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు గ్రామం. 20 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అందులో సుమారు ఐదు ఎకరాల్లో పొద్దు తిరుగుడు పంట సాగు చేశారు. 14.5 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఇటీవల సిద్దిపేట మార్కెట్‌లో పొద్దుతిరుగుడు గింజలను విక్రయించారు. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్ ఉంటే వ్యాపారులు నేరుగా కల్లాల వద్దకే వచ్చి కొనుగోలు చేసేవారు. ఈసారి వ్యాపారులెవరూ రాలేదు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడంతో ఇక్కడికి తీసుకొచ్చి విక్రయించారు. తరుగు పేరుతో వ్యాపారులు ఒక్కో క్వింటాల్‌కు 5 కిలోలు కోత పెట్టేవారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ఎలాంటి కోతలు లేకుండానే తీసుకుంటున్నారు. దీంతో క్వింటాల్ గింజలు తరుగుమీద మిగిలినట్టయ్యింది. ధరను ఇంక కొంచెం పెంచితే బాగుండు అని రైతు అన్నారు.


సిద్దిపేట వ్యవసాయ మార్కెట్‌లో..

కొనుగోళ్లు ఇలా..

సిద్దిపేటలోని వ్యవసాయ మార్కెట్‌లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని గత నెల 23వ తేదీన మంత్రి హరీశ్‌రావు ప్రారంభించారు. గజ్వేల్‌లో మార్చి 1వ తేదీ నుంచి అందుబాటులోకి రాగా, రామాయంపేటలో మార్చి 25వ తేదీన మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి ప్రారంభించారు. ఇప్పటివరకు సిద్దిపేటలో 776 మంది రైతుల నుంచి 9500 క్వింటాళ్లు, గజ్వేల్‌లో 100 మంది నుంచి 1225 క్వింటాళ్ల పొద్దుతిరుగుడు గింజలు కొనుగోలు చేశారు. రెండురోజుల క్రితమే ప్రారంభం కావడంతో ఇప్పుడిప్పుడే రైతులు రామాయంపేటలో కొనుగోలు కేంద్రానికి వస్తున్నారు. ఇంకా కాంటాలు వేయలేదు.

దిగుబడి తగ్గినా మద్దతు ధరతో ఊరట



నా పేరు గొడుగు కర్ణాకర్. మాది గజ్వేల్ మండలం కొలుగూరు గ్రామం. ఏడెనిమిది ఏళ్లుగా పొద్దుతిరుగుడు సాగు చేస్తున్న. ఈసారి రెండున్నర ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట వేసిన. ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాలి. కానీ రెండున్నర ఎకరాల్లో మొత్తం కలిపి 15 క్వింటాళ్లు మాత్రమే దిగుబడి వచ్చింది. బయట మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ.4500 ధర పలుకుతుండగా... ప్రభుత్వం సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో రూ.6400 మద్దతు ధర లభించడం సంతోషంగా ఉంది. దిగుబడి తగ్గినా మద్దతు ధర ఎక్కువగా ఉండడంతో ఊరట కలిగింది.

ప్రమాదవశాత్తు ఒకరి మృతి

ట్యాంక్ నిర్మాణ పనులు చేస్తుండగా...

అక్కన్నపేట(హుస్నాబాద్): మిషన్ భగీరథ వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులు జరిగే చోట ప్రమాదవశాత్తు కిందపడి ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్రగాయాలు అయ్యాయి. ఎస్‌ఐ తాండ్ర వివేక్ తెలిపిన వివరాల ప్రకారం...ఏపీలోని ప్రకాశం జిల్లా అక్కంపేటకు చెందిన ఎక్కలూరి రవీందర్‌రెడ్డి(30)తోపాటు గుడిల్ల రవిలు కొద్దిరోజులుగా మండల పరిధిలోని కట్కూర్‌లో ట్యాంకు నిర్మాణ పనులు చేస్తున్నారు. సోమవారం కూడా రోజు మాదిరిగానే పనుల్లో భాగంగా ట్యాంక్ చుట్టూ కర్రలు కట్టారు. కిందనుంచి వచ్చే సిమెంట్ మాల్‌ను ఇద్దరూ పైకి లాగుతున్నారు. ఈ క్రమంలోనే రవీందర్‌రెడ్డి కిందపడి అక్కడికక్కడే మృతి చెందగా, గుడిల్ల రవి రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. హుటాహుటిన చికిత్స నిమిత్తం 108లో కరీంనగర్ జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

కలుషిత జలాలతో చేపలు మృతి



కొండాపూర్(సంగారెడ్డి): చెరువులోకి కలుషిత జలాలు చేరడంతో సుమారు 3వేల చేపలు మృతి చెందాయి. గ్రామస్తుల కథనం ప్రకారం... మండల పరిధిలోని మల్లెపల్లి శివారులో 4 మద్యం, 15 టైర్ల పరిశ్రమలు ఉన్నాయి. ఇటీవల వర్షాలు కురిసిన నేపథ్యంలో సమీపంలోని పలు పరిశ్రమలు వ్యర్థాలను బయటకు వదిలాయి. అవి నేరుగా గ్రామంలోని చెరువులోకి చేరాయి. దీంతో చేపలు మృత్యువాత పడ్డాయి. పొలాలు, గ్రామంలో ఉన్న బోర్లలోనూ రంగుమారిన నీరు వస్తోందని, అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

మహిళ హత్య

నిందితుడు గుర్తు తెలియని వ్యక్తి

కొండపాక(గజ్వేల్): మండలపరిధిలోని తిమ్మారెడ్డిపల్లి శివారులో దండు రజిత(35)ను గుర్తు తెలియని వ్యక్తి హత్య చేశారు. కుకునూరుపల్లి ఎస్‌ఐ పుష్పరాజ్ తెలిపిన వివరాల ప్రకారం ..తొగుట మండలం పెద్దమాసాన్‌పల్లికి చెందిన యాదగిరి కొన్నేళ్ల క్రితం చనిపోగా, భార్య దండు రజిత ఉపాధి కోసం సిద్దిపేటకు వచ్చింది. స్థానికంగా ఉండే మల్లపు మల్లమ్మతో కలిసి కూలిపనులకు వెళ్లేది. ఎక్కడకు వెళ్లినా ఇద్దరూ కలిసేపోయేవారు. సోమవారం తెల్లవారుజామున తిమ్మారెడ్డిపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో రజితకు తీవ్ర గాయాలయ్యాయని మల్లమ్మ పోలీసులు సమాచారం ఇచ్చింది. దీంతో రజితను టోల్‌ప్లాజా అంబులెన్సులో సిద్దిపేట ప్రభుత్వ ఆస్పతికి తరలించారు. మధ్యాహ్నం వరకు రజిత స్పృహలోకి రాలేదు. పైగా మల్లమ్మ చెప్పే మాటలపై అనుమానం వచ్చింది. దీంతో ఎస్‌ఐ విచారించగా, గుర్తు తెలియని వ్యక్తి రజిత తలపై రాడ్డుతో బలంగా కొట్టడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లినట్టు విచారణలో తేలిందన్నారు. చికిత్స పొందుతూ రజిత ఆస్పత్రిలో చనిపోయింది. సెల్‌ఫోన్ కాల్‌డేటా ఆధారంగా అన్ని కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. తొగుట సీఐ కమలాకర్, గజ్వేల్ ఏసీపీ రమేష్‌లకు ఈ ఘటనపై సమాచారం అందించామన్నారు. వీలైనంత త్వరలో నిందితుడిని పట్టుకొని రిమాండ్‌కు తరలిస్తామని గజ్వేల్ ఏసీపీ రమేష్ తెలిపారు.


దండు రజిత మృతదేహం

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


సొడా యాదగిరి(ఫైల్)

నిజాంపేట(మెదక్): అనుమానాస్పద స్థితిలో ఓ యువకుడు మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..మండల పరిధిలోని నందగోకుల్ గ్రామానికి చెందిన సొడా యాదగిరి(38) ఆదివారం రాత్రి బయటకు వెళ్లాడు. తిరిగి వస్తుండగా, ఇంటికి వంద మీటర్ల దూరంలో చనిపోయాడు. చుట్టుపక్కల వారు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడికి భార్య మమతతోపాటు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యక్తి ఆత్మహత్య


బాబు (ఫైల్)

రామాయంపేట(మెదక్): అనారోగ్యంతో బాధపడుతూ ఒకరు ఆత్మహత్య చేసుకున్నారు. నార్సింగి మండలం శేరిపల్లి గ్రామానికి చెందిన పంబల్ల బాబు (35) ఒకవైపు అనారోగ్యం, మరోవైపు ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నాడు. ఆదివారం రాత్రి ఇంట్లోనే ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్యతో పాటు 12 ఏళ్లలోపు ముగ్గురు పిల్లలు ఉన్నారు. తండ్రికోసం చిన్నారులు విలపించడం గ్రామస్తులను కంటతడి పెట్టించింది. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఆన్‌లైన్ ఉద్యోగాల మాయలో పడొద్దు

గజ్వేల్‌రూరల్: ఆన్‌లైన్‌లో ఉద్యోగాల పేరుతో వచ్చే ప్రకటనల మాయలో పడి ప్రజలు డబ్బులు పోగొట్టుకోవద్దంటూ పోలీసులు హెచ్చరిస్తున్నారు. గజ్వేల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల ఆన్‌లైన్ జాబ్ రిక్వెస్ట్ పేరిట ఓ బాధితునికి సమాచారం వచ్చింది. సైబర్ నేరగాళ్లు క్రెడిట్ కార్డు, బ్యాంకు వివరాలు కావాలని కోరడంతో బాధితుడు వెంటనే చెప్పాడు. దీంతో అతడి అకౌంట్ నుంచి రూ.1,70,000 కట్ అయ్యాయి. వెంటనే గుర్తించి జాతీయ హెల్ప్‌లైన్ నెంబర్ 1930కు సమాచారం ఇవ్వగా, స్పందించి రూ.99,000 ఫ్రీజ్ చేశారు. ప్రజలు ఆన్‌లైన్‌లో వచ్చే ప్రకటనల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అపరిచిత వ్యక్తులకు బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన వివరాలను తెలియజేయవద్దని పోలీసులు సూచించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

నంగునూరు(సిద్దిపేట): అనుమతి లేకుండా రాత్రిపూట ఇసుక రవాణా చేస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్టు రాజగోపాల్‌పేట ఎస్‌ఐ రాజుగౌడ్ తెలిపారు. అక్కేనపల్లికి చెందిన నాలుగు ఇసుక ట్రాక్టర్లు నంగునూరు పెద్దవాగు నుంచి ఇసుక రవాణా చేస్తున్నట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సమాచారం అందించారన్నారు. సిబ్బందితో కలసి దాడి చేసి ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో తదుపరి చర్యల నిమిత్తం తహసీల్దార్‌కు అప్పగించామన్నారు.

కలప తరలిస్తున్న వాహనాలు పట్టివేత

నర్సాపూర్: అక్రమంగా కలపను తరలిస్తున్న రెండు వాహనాలను పట్టుకుని సీజ్ చేసినట్టు అటవీశాఖ వెంకట్రావ్‌పేట సెక్షన్ అధికారి ఎండీ కరీమొద్దీన్ చెప్పారు. విశ్వసనీయసమాచారం మేరకు సోమవారం నర్సాపూర్–మెదక్ హదారిపై అంతారం గేట్ వద్ద తనిఖీ చేయగా, అక్రమంగా కలపను తరలిస్తున్న రెండు వాహనాలు గుర్తించామన్నారు. వాటిని సీజ్ చేసి నర్సాపూర్‌లోని అటవీశాఖ రేంజ్ కార్యాలయానికి తరలించామన్నారు.

జయరాజ్‌కు మంత్రి పరామర్శ



జయరాజు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మంత్రి హరీశ్‌రావు

సంగారెడ్డి మున్సిపాలిటీ : సీపీఎం జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజ్ కుమారుడు ప్రశాంత్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించారు. విషయం తెలుసుకున్న మంత్రి హరీశ్‌రావు టీఎస్‌హెచ్‌డీసీ చైర్మన్ చింత ప్రభాకర్‌తో కలసి సోమవారం రాత్రి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. సంగారెడ్డిలోని సీపీఎం కార్యాలయంలో ప్రశాంత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి వెంట కలెక్టర్ శరత్, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి, పట్నం మాణిక్యం తదితరులు ఉన్నారు.

గురుకుల పాఠశాల తనిఖీ


వివరాలు తెలుసుకుంటున్న రీజినల్ కోఆర్డినేటర్ ప్రభాకర్

తూప్రాన్: పోతరాజుపల్లిలోని మహాత్మ జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను సోమవారం గురుకుల పాఠశాలను రీజినల్ కోఆర్డినేటర్ ప్రభాకర్ తనిఖీ చేశారు. అనారోగ్యంతో 8వ తరగతి విద్యార్థిని సౌజన్య ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన సంగతి తెలిసిందే. విద్యార్థిని మృతికి గల కారణాలను పాఠశాల ప్రిన్సిపల్ అర్షియా తరుణ్ణంను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనంతో పాటు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

బోరు మోటారు వైర్ల దొంగ అరెస్ట్

కొండాపూర్(సంగారెడ్డి): బోరు మోటార్ వైర్లు అపహరించిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. కొండాపూర్ సీఐ సంతోష్‌కుమార్ కథనం ప్రకారం.. కందికి చెందిన దాసరి నర్సింలు సోమవారం ఉదయం 6 గంటలకు మండల పరిధిలోని గారకుర్తిలోని ఓ వ్యవసాయభూమి వద్ద అనుమానాస్పదంగా కనిపించాడు.విచారిస్తే మోటారు వైర్ దొంగిలించేందుకు వచ్చినట్టు అంగీకరించాడు. ఇటీవల మండలంలో బోరు మోటార్ వైర్ల చోరీలు ఎక్కువగా జరగడంతో పొలాల వద్ద నిఘా ఉంచామని, అందులో భాగంగానే నర్సింలును పట్టుకున్నామన్నారు. ఎస్‌ఐ వెంకటేశం, సిబ్బంది సూర్య, గౌసొద్దిన్, హేంసింగ్, రామకృష్ణ, జగన్నాథం, శ్రీరాంను సీఐ అభినందించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురి మృతి

ఉమ్మడి జిల్లా పరిధిలో చోటుచేసుకున్న వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు మృతి చెందగా, పలువురు గాయపడ్డారు.

కారు అదుపు తప్పి...

పటాన్‌చెరు టౌన్: కారు అదుపు తప్పిన ఘటనలో ఒకరు మృతి చెందారు. మరొకరు గాయపడ్డారు. ఎస్‌ఐ రామానాయుడు కథనం ప్రకారం.. మండలపరిధిలోని ముత్తంగి సాయిప్రియకాలనీకి చెందిన మహేష్(35) పటాన్‌చెరులో జరిగిన స్నేహితుడి పిల్లల ఫంక్షన్‌కు ఆదివారం స్నేహితుడు నితీష్‌రెడ్డికి తీసుకొని వెళ్లాడు. ఫంక్షన్ ముగిశాక తిరిగివస్తుండగా, ముత్తంగి చర్చి సమీపంలోకి రాగానే కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి ఆపై, రోడ్డు అవతలి వైపునకు వెళ్లి సంగారెడ్డి వైపు నుంచి వస్తున్న లారీని ఢీకొట్టింది. ఈ ఘటనలో తీవ్రగాయాలై మహేష్ అక్కడికక్కడే మృతి చెందాడు. నితీష్‌రెడ్డికి తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడు..

కొండపాక(గజ్వేల్): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడని త్రీటౌన్ సీఐ భానుప్రకాష్ తెలిపారు. వివరాల్లోకి వెళితే... మండల పరిధిలోని దుద్దెడకు చెందిన గొడుగు శ్రీనివాస్‌తో కలిసి గొడుగు రవి(18) బైక్‌పై ఆదివారం రాత్రి మైలారంలోని శ్రీనివాస్ స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. వీడియో కెమెరా తీసుకొని దుద్దెడకు వస్తుండగా, మార్గమధ్యలో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రాయిని ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న రవి తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందాడు. శ్రీనివాస్‌కు కూడా తీవ్ర గాయాలయ్యాయి.

కారు ఢీకొని...

కంది(సంగారెడ్డి): కారు బైక్‌ను ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొకరు గాయపడ్డారు. రూరల్ ఎస్‌ఐ ఖుర్షీద్‌అలీ కథనం ప్రకారం.. సంగారెడ్డిలోని గణేష్‌నగర్‌కు చెందిన గొల్లపల్లి ప్రశాంత్(21) తన స్నేహితుడు శివసాయితో కలిసి ఆదివారం రాత్రి బైక్‌పై కంది నుంచి సంగారెడ్డికి వెళుతున్నాడు. ఈ క్రమంలో కంది శివారులోని జాతీయరహదారిపైగల పెట్రోల్ పంపు సమీపంలో సంగారెడ్డి వెళుతున్న కారు వెనుక నుంచి బైక్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న ప్రశాంత్, శివసాయిలు గాయపడ్డారు. చికిత్స నిమిత్తం వీరిని సంగారెడ్డిలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ప్రశాంత్ మృతి చెందాడు. మృతుడి తండ్రి జయరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న రైతు..


ప్రభాకర్ (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): చికిత్స పొందుతూ ఒకరు మృతి చెందారు. పోలీసుల కథనం ప్రకారం..మండల పరిధిలోని విఠలాపూర్ గ్రామానికి చెందిన రైతు చెప్యాల ప్రభాకర్ (30) ఈ నెల 21న కొండాపూర్‌లో జరిగిన విందుకు బైక్‌పై వెళ్లాడు. తిరిగి వస్తుండగా, అదేరోజు రాత్రి సమయంలో విఠలాపూర్ గ్రామ శివారులో బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కన చెట్టును ఢీకొంది. దీంతో బలమైన గాయాలయ్యాయి. వెంటనే సిద్దిపేట జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడి సోదరుడు బాల్‌నర్సు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

స్నేహితుల నడుమ సెల్‌ఫోన్ గొడవ

భానుప్రసాద్ హత్యకు అదే కారణం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ సురేందర్‌రెడ్డి

జిన్నారం(పటాన్‌చెరు): స్నేహితుల మధ్య సెల్‌ఫోన్ విషయంలో జరిగిన గొడవ హత్యకు దారితీసింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను సోమవారం బొల్లారం పీఎస్‌లో సీఐ సురేందర్‌రెడ్డి వెల్లడించారు. బొల్లారం మున్సిపాలిటీలోని బాలాజీనగర్‌కు చెందిన బాల్‌రాజ్ కుమారుడు భానుప్రసాద్ (23) ఓ ప్రైవేటు పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈనెల 14వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లిన భానుప్రసాద్ తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల వద్ద భానుప్రసాద్ ఆచూకీ కోసం ప్రయత్నించారు. అయినా ఫలితం లేకపోవటంతో 16న పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడి మిస్సింగ్ కింద పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈనెల 19వ తేదీన బాలాజీనగర్‌లోని ఓ ముళ్లపొదల మధ్య గుర్తుతెలియని మృతదేహాన్ని పోలీసులు గుర్తించారు. అది భానుప్రసాద్ మృతదేహం కావడంతో హత్యకు గురయ్యాడని పోలీసులు ఒక నిర్ధారణకు వచ్చారు. భానుప్రసాద్ స్నేహితులైన సందేశ్‌కుమార్, వికాస్‌కుమార్‌లను అనుమానించారు. తమదైన శైలిలో విచారించగా, అసలు విషయం వెలుగుచూసింది. భానుప్రసాద్ తండ్రి బాల్‌రాజ్ నెల రోజుల క్రితం మద్యం సేవించి పడిపోయాడు. స్నేహితుడైన సందేశ్‌కుమార్‌తో కలిసి భానుప్రసాద్ తన తండ్రికి ఇంటికి తీసుకెళ్లారు. ఆ సమయంలో బాల్‌రాజ్ వద్ద ఉన్న సెల్‌ఫోన్ పడిపోయింది. మా నాన్న ఫోన్ నువ్వే తీశావని సందేశ్‌కుమార్‌ను భానుప్రసాద్ ప్రశ్నించారు. ఈ విషయంలో ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. దీనిని మనసులో పెట్టుకున్న బీహార్‌కు చెందిన సందేశ్‌కుమార్ ఎలాగైనా భానుప్రసాద్‌ను చంపాలని నిర్ణయించుకున్నాడు. ఈ నెల 13న మద్యం సేవిద్దామని సందేశ్‌కుమార్, భానుప్రసాద్‌లు బాలాజీనగర్‌లోని ఓ చెట్టు వద్దకు వెళ్లారు. సందేశ్‌కుమార్ తన స్నేహితుడైన వికాస్‌కుమార్‌ను మద్యం సేవించే స్థలానికి పిలిచారు. మీ నాన్న ఫోన్ తీసుకెళ్లానని నాపై ఆరోపణలు చేయటం సరైంది కాదని భానుప్రసాద్‌ను రెచ్చగొట్టేలా సందేశ్‌కుమార్ మాట్లాడాడు. ఈ సమయంలోనే జరిగిన గొడవలో భానుప్రసాద్‌పై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. చనిపోయాక ముళ్లపొదల్లో మృతదేహాన్ని పడేశారు. ఈ హత్యకు కారణమైన సందేశ్‌కుమార్, వికాస్‌కుమార్‌లను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు.